



సంబేపల్లెలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



కొప్పుల మంగమ్మకు పెన్షన్ అందజేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, చిత్రంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం



లబ్ధిదారులకు ఆటోలు పంపిణీ చేస్తున్న సీఎం చంద్రబాబు



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో సీఎం చంద్రబాబుతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, ముక్కా రూపానందరెడ్డి తదితరులు

హంద్రీనీవా ప్రాజెక్టుకు త్వరలోనే టెండర్లు పిలిచి ఆ పనులను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ ప్రాజెక్టుకు పైసా కూడా ఇవ్వకుండా ఈ ప్రాంతవాసులకు తీరని అన్యాయం చేసిందన్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతవాసుల రుణం తీర్చుకుంటానని అన్నారు. శనివారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబు సంబేపల్లెలో పర్యటించారు. ఇద్దరు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేయడంతో పాటు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రజావేదిక సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో సీఎం ముఖాముఖి మాట్లాడారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



సంబేపల్లెలో జరిగిన సభలో సీఎంకు దండం పెడుతున్న మహిళలు

హంద్రీనీవా ప్రాజెక్టుకు త్వరలో టెండర్లు





- సీఎం చంద్రబాబు నాయుడు
- లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
- ఐటీ ఉద్యోగులతో ముఖాముఖి
- ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ
- గ్రీన్ ఎనర్జీ కింద ఆరు ఆటోల పంపిణీ
- సంబేపల్లెలో ముఖ్యమంత్రికి ఘనస్వాగతం
- ప్రజల నుంచి విశేష స్పందన

రాయచోటి/సంబేపల్లె/రాయచోటి కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలో ఉన్న 2014 నుంచి 2019 వరకు వేల కోట్ల రూపాయలు వ్యయం చేసి హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు పూర్తి చేశాం, ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ ప్రాజెక్టు కోసం పైసా కూడా నిధులు కేటాయించలేదు.. తామే 2019లో అధికారంలోకి వచ్చి ఉంటే 2020 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయి రైతులకు నీళ్లు అందేవి.. త్వరలోనే... ఈ ప్రాజెక్టు పనుల కోసం టెండర్లు పిలుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం ఆయన సంబేపల్లె మండల కేంద్రంలోని సంతగేట్‌కాలనీలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి స్వయంగా అందజేశారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రీన్ ఎనర్జీ కింద ఆరు ఆటోలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సోలార్ బ్యాటరీతో నడిచే ఆటోలు అని, వీటిని ఉపయోగించుకుని కుటుంబాన్ని ఇబ్బందులు లేకుండా పోషించుకోవాలని తెలిపారు. అనంతరం ప్రజావేదిక వద్ద ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తయి ఉంటే అన్నమయ్య జిల్లాతో పాటు చిత్తూరు జిల్లాకు కూడా నీళ్లు అందేవన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టును పూర్తిగా పట్టించుకోకపోవడంతో రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ విజన్ స్వర్ణాంధ్ర-2047 మొదటి సూత్రమైన పేదరిక నిర్మూలనలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా పేదలకు ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి భరోసా కల్పిస్తూ ఆదుకుంటున్నారన్నారు. 2047 నాటికి ఆంధ్రరాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి, రాష్ట్రాన్ని సుసంపన్నంగా, ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేందుకు పది సూత్రాలతో మహోత్తరమైన ఒక ప్రణాళికను ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఇచ్చారన్నారు. ఈ పదిసూత్రాల ప్రణాళికను ఆధారంగా చేసుకుని ప్రతి సంవత్సరం 15 శాతం వృద్ధి, అంతకు మించి లక్ష్యంగా పెట్టుకుని స్వర్ణ అన్నమయ్య జిల్లాను సాధించడానికి ముఖ్యమంత్రి మార్గదర్శకంలో పనిచేస్తామన్నారు. సంబేపల్లె గ్రామంలో ఆరవ సూత్రమైన గ్లోబల్ లాజిస్టిక్స్‌లో భాగంగా ఈ గ్రామంలో సంతృప్త స్థాయిలో ప్రతి ఇంటికి సీసీ రోడ్లు, డ్రైన్లు ఏర్పాటుకు రూ.1.64 కోట్లతో పనులు చేపట్టేందుకు శిలాఫలకం అవిష్కరించినట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో ఇప్పటికే ఈ గ్రామంలో రూ.1.40 కోట్లతో సీసీ రోడ్లు పూర్తి చేసినట్లు తెలిపారు మొత్తంగా ఈ గ్రామ అభివృద్ధికి రూ.మూడు కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వృద్ధి చెందిన వాళ్లు దిగువ స్థాయిలో ఉన్న వారిని దత్తత తీసుకోవాలన్న ముఖ్యమంత్రి సూచనను స్ఫూర్తిగా తీసుకుని సంబేపల్లె గ్రామంలో నాలుగు కుటుంబాలకు అర్చన విద్యాసంస్థల యాజమాన్యం విద్యుత్ ఉత్పత్తి కోసం సోలార్ ప్యానల్‌లను అందజేశారు. గ్రామసభలో ప్రజలందరూ చర్చించుకుని 10 సూత్రాల ద్వారా ఏ విధంగా స్వర్ణ సంబేపల్లె సాధించాలో చర్చించుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు.

30 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి : మంత్రి

నియోజకవర్గంలోని హెచ్ఎన్ఎస్ఎస్ శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులు పూర్తి చేసి 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. శనివారం సంబేపల్లె ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జరిగిన ప్రజా వేదికలో మండిపల్లి మాట్లాడుతూ మాది కరువు ప్రాంతమని రాష్ట్రమంతా వర్షాలు పడితే ఇక్కడ కరువు పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో మీ సహకారంతో అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.100 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో రూ.15 కోట్లతో 300 బోర్లు వేశామని తెలిపారు. ఈ ప్రాంతంలో పండ్ల తోటలను దృష్టిలో పెట్టుకుని కోల్డ్ స్టోరేజ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలని ముఖ్యమంత్రిని కోరారు. హంద్రీ-నీవా శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తే 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, జల్ జీవన్ మిషన్ కింద 6 మండలాలోని 750 పల్లెలకు నీళ్లు ఇవ్వవచ్చని తెలిపారు. రాయలసీమ జిల్లాలకు నీళ్లు ఇస్తే కరువు సీమ రతనాల సీమగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరు ఇచ్చి మీ రుణం తీర్చుకుంటానన్నారు. పోలవరం నుంచి బనకచర్ల ద్వారా రాయచోటికి నీటిని అందించి కరువు అనే మాట లేకుండా చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఆదాయం పెంచుకునే మార్గాలను వెతుక్కోవాలన్నారు. పేదలు పేదలుగానే ఉండకుండా ఆదాయం మార్గాలు నేర్చుకున్నప్పుడే ఆర్థికంగా స్థిరపడతారని తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సోలార్ ఫ్రీగా అందించేందుకు కృషి చేస్తామన్నారు. 60 శాతం సబ్సిడీతో మిగిలిన వారికి అందించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ విధానాలు కూడా మార్చుకోవాలని తెలిపారు. ఏ పంట వేస్తే లాభాలు సాధించవచ్చు అలాంటి పంటలను వేసుకొనే విధంగా ప్రోత్సహిస్తామని తెలిపారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, కాలువల నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

సంబేపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో రూ.1.64 కోట్ల అంచనాతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. అంతకుముందు ముఖ్యమంత్రి సంబేపల్లె మండల కేంద్రం సంతగేటు ప్రవేశద్వారం వద్ద ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి, అభ్యున్నతికి, అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిశోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్‌బాషా, అరవ శ్రీధర్, కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి, అన్నమయ్య జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం

తొలుత ముఖ్యమంత్రికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. మధ్యాహ్నం 12..55 గంటలకు మోటకట్ల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, క్రీడా,యువజన శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాష, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌ఛార్జ్ జయచంద్రారెడ్డి తదితరులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

సాయంత్రం 4.22 గంటలకు మండలంలోని మోటకట్ల గ్రామంలోని హెలీప్యాడ్ నుంచి కడప విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, రాజంపేట పార్లమెంటు జనరల్ సెక్రటరీ దొరస్వామినాయుడు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసిన సీఎం

- వికలాంగునికి బ్యాటరీ సైకిల్ పంపిణీ

సంబేపల్లెలోని కొప్పుల మంగమ్మ (82)కు పింఛను మొత్తం రూ.4 వేలు అందచేసి ఆమెతో మాట్లాడారు. పింఛన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం చాలా సంతోషంగా ఉందని, ఇందుకు ముఖ్యమంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పెంచిన పింఛన్‌తో జీవనం సాఫీగా నడుస్తోందని ముఖ్యమంత్రితో తన సంతోషం వ్యక్తపరిచారు. తనకు ఇల్లు లేదని, ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇల్లు మంజూరు చేయాలని అలాగే తన మనవరాలు గంగాదేవికి ఏఆర్‌టీ పింఛన్, మరుగుదొడ్డి మంజూరు చేయాలని ఆమె ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. వారికి ఇంటి స్థలం, ఏఆర్‌టీ పింఛను, మరుగుదొడ్డి మంజూరుతో పాటు సూర్యఘర్ పథకం కింద ఉచితంగా సోలార్ విద్యుత్ యూనిట్, దీపం-2 కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ కూడా మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం అదే గ్రామంలోని దివ్యాంగుడు గొల్ల వెంకటేశ్వర్లు ఇంటి వద్దకు వెళ్లి రూ.6 వేలు పింఛన్ అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచడంపై ముఖ్యమంత్రికి తన కృతజ్ఞతలు తెలిపారు. తనకు బ్యాటరీ ట్రైసైకిల్ మంజూరు చేయాలని కోరగా బ్యాటరీ సైకిల్ మంజూరు చేస్తున్నానని చంద్రబాబు హామీ ఇచ్చారు.



గొల్ల వెంకటేశ్వర్లుకు బ్యాటరీ సైకిల్ అందచేసిన సీఎం

ములకలచెరువు టు అండమాన్

- టమోటాలు తరలింపు
- ఇక్కడి నుంచి చెన్నైకి.. ఓడ ద్వారా అండమాన్‌కు
- ధరల పతన సమయంలో రైతుకు గిట్టుబాటు

ములకలచెరువు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో పండించిన టమోటాలు అండమాన్‌కు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి నుంచి చెన్నైకి తరలించి...అక్కడి నుంచి ఓడ ద్వారా అండమాన్ నికోబార్ దీవులకు పంపుతున్నారు. ఇప్పటి వరకు 10 వేల బాక్సుల కాయలు అండమాన్‌కు పంపారు. తాజాగా మరో 500 బాక్సులను తీసుకుని శనివారం ఇక్కడి నుంచి లారీ బయలుదేరి వెళ్లింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వ్యాపారులు ములకలచెరువుకు వచ్చి అండమాన్‌కు టమోటాలు తరలించేందుకు తోటలను ఎంపిక చేసుకుంటున్నారు. తాజాగా ములకలచెరువుకు చెందిన రైతు మునీర్ సాగు చేసిన టమోటా పంటను పరిశీలించి 500 బాక్సుల కాయలు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో శనివారం పచ్చి, దోరగా ఉన్న టమోటాలను కూలీలతో బాక్సుల్లో ప్యాకింగ్ చేయించారు. రైతు వద్ద నుంచి బాక్సు రూ.450తో కొనుగోలు చేశారు. 15 టన్నుల కాయలను తీసుకుని లారీ చెన్నై ఓడరేవుకు బయలుదేరింది. ఈ లారీ అర్ధరాత్రి చెన్నైకి చేరుకోనుంది. అనంతరం ఆదివారం టమోటాలను తీసుకుని ఓడ అండమాన్ నికోబార్ దీవులకు బయలుదేరనుంది. ఈ టమోటాలు ఐదు రోజుల్లోగా అండమాన్‌కు వెళ్తాయని వ్యాపారులు చెబుతున్నారు. పచ్చికాయలు రవాణా చేసేందుకు అనువుగా ఉంటాయని, టమోటాలు ఎనిమిది రోజులైనా దెబ్బతినవని, ఇక్కడి నుంచి చెన్నై, అండమాన్ నికోబార్ దీవులకు 3500 కిలోమీటర్లు దూరం ఉంటుందని వ్యాపారులు తెలిపారు. అండమాన్‌లో 27 కిలోల టమోటా బాక్సు రూ.వెయ్యికి ఉంటుందని, అండమాన్‌కు తరలించేందుకు రవాణా ఖర్చు ఎక్కువ అవుతుందని తెలిపారు. కాగా ప్రస్తుతం టమోటా ధరలు కుప్పకూలాయి. బాక్సు రూ.100 నుంచి రూ.200 వరకు మాత్రమే పలుకుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇలాంటి సమయంలో తోటల వద్దకు వచ్చి టమోటాలు అండమాన్‌కు తరలిస్తున్న వ్యాపారులతో ఒకరిద్దరు రైతులకు ఊరట లభిస్తోంది. బాక్సు రూ.450తో కొనుగోలు చేస్తుండడం, కోత చేస్తున్న కూలీల, రవాణా ఖర్చు వ్యాపారులదే కావడం, కమీషన్ లేకపోవడంతో అండమాన్‌కు తరలుతున్న టమోటాలతో రైతులకు మేలు జరుగుతోంది.



టమోటాలు ప్యాకింగ్ చేస్తున్న కూలీలు



అండమాన్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన పచ్చి టమోటాలు

ప్రతి ఏడాది 50 వేల బాక్సులు అండమాన్‌కు పంపుతాం..



ప్రతి ఏడాది 30 నుంచి 50 వేల బాక్సుల టమోటాలను అండమాన్‌కు పంపుతాం. ఇక్కడి నుంచి అండమాన్‌కు 3500 కిలోమీటర్లు దూరం ఉంది. అండమాన్‌కు రవాణా చేసేందుకు పచ్చి, దోరకాయలు అవసరం. రైతులకు బాక్సుకు రూ.450 చెల్లిస్తున్నాం. అండమాన్‌లో బాక్సు ధర రూ.900 వరకు ఉంది. ప్రతి ఏడాది ఈ ప్రాంతానికి వచ్చి టమోటాలు కొనుగోలు చేసి అండమాన్‌కు తరలిస్తున్నాం.

- శివానంద, వ్యాపారి, చింతామణి, కర్ణాటక

గిట్టుబాటు అవుతోంది..



10 ఎకరాల్లో టమోటా సాగు చేశాను. ప్రస్తుతం ధరలు పడి పోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాను. తమిళనాడు, కర్ణాటక వ్యాపారులు తోట వద్దకు బాక్సు రూ.450తో 500 బాక్సుల కాయలు కొనుగోలు చేశారు. దీంతో గిట్టుబాటు అవుతోంది. టమోటాలు కోత విధించిన కూలీల, రవాణా ఖర్చు వ్యాపారులు భరిస్తారు. కమీషన్ ఉండదు.

- మునీర్, రైతు, ములకలచెరువు

రిమాండ్‌కు సీఐ, ఎస్ఐ

- ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం నెల్లూరుకు తరలింపు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ పట్టుబడిన రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, మదనపల్లె రూరల్ సీఐ రమేశ్‌ను శనివారం ఏసీబీ అధికారులు నెల్లూరు కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఏసీబీ సీఐ వెంకటప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ నౌషాద్‌ల ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో వారిద్దరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. గత నెల 22వ తేదీ లారీ, బైకు ఢీకొని రామసముద్రంకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన కేసులో తిరుపతికి చెందిన లారీ ఓనర్ మనోజ్ వద్ద గురువారం రూ.70 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు పట్టుబడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఏసీబీ అధికారులు కేసును దర్యాప్తు నిర్వహించి నిజానిజాలు నిగ్గు తేల్చారు. ఇందులో వారి ప్రమేయం ఉండడంతో వారిని శుక్రవారం అదుపులోకి తీసుకుని, శనివారం మదనపల్లెలో సీఐ, ఎస్ఐ ఇళ్లల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. శనివారం సీఐ, ఎస్ఐలపై కేసు నమోదు చేసి వారిద్దరినీ నెల్లూరు కోర్టుకు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.



ఆస్పత్రిలో సీఐ రమేశ్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

లంకమలలో చింకార జింక

- సీసీ కెమెరాలో గుర్తించిన అటవీశాఖ సిబ్బంది



సిద్దవటం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం రేంజ్ లంకమల్ల అటవీ ప్రాంతం కొండూరు బీట్ ప్రాంతంలో సీసీ కెమెరాల తనిఖీల్లో భాగంగా అరుదైన చింకార జింక ఆచూకీని అటవీశాఖ సిబ్బంది కనుగొన్నారు. లంకమలలో ఇటువంటి జింక కనిపించడం ఇదే మొదటిసారి అని అటవీ శాఖ సిబ్బంది చెబుతున్నారు. సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ కొండూరు బీట్ అటవీ ప్రాంతలో సీసీ కెమెరాల తనిఖీల్లో భాగంగా అరుదైన వన్యప్రాణి చింకార జింకను అటవీశాఖ సిబ్బంది కనుగొన్నారు. ఈ సందర్భంగా శనివారం అటవీశాఖ కార్యాలయంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో కలివికోడి ఆచూకీ కోసం 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, 15 రోజులకు ఒకసారి తనిఖీల్లో భాగంగా కెమెరాలో చింకార జింకను కనుగొన్నామని, అటవీ ప్రాంతంలో పాదముద్రలను గుర్తించడానికి తనిఖీలు చేయగా మచ్చాయికుంట వద్ద లభ్యమయ్యాయని తెలిపారు. లంకమల ఫారెస్ట్ రేంజ్ అటవీ ప్రాంతంలోని సీసీ కెమెరాల ద్వారా కనుగొన్నామని, కొండలకు నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణుల మనుగడ దెబ్బతింటుందని అటవీ సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె తెలిపారు.

100 దేశాల్లో 'సాఫ్ట్‌వేర్'లో మనవారే...

● ఐటీ రంగాన్ని యువతకు అందించాం ● ఆకాశమే హద్దుగా డబ్బులు సంపాదిస్తున్నారు
● సాఫ్ట్‌వేర్‌తో పాటు యువతను రాజకీయంగా ప్రోత్సహిస్తాం ● ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



అన్నమయ్య జిల్లా సంబేపల్లెలో జరిగిన ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు - సీఎంతో మాట్లాడుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

సంబేపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల్లో మన తెలుగు వారు, భారతీయులు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. సంబేపల్లెలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబును సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కలిశారు. వారితో సీఎం మాట్లాడుతూ యువతకు టెక్నాలజీని పరిచయం చేశాం, హైటెక్ సిటీ కట్టాం, హైటెక్ టవర్ ఏర్పాటు చేశాం. ఐటీ చదువుకోవాలని ఆశ పుట్టించాం. దీంతో ప్రస్తుతం యువత సాఫ్ట్‌వేర్ రంగంలో సంపాదిస్తూ ఆదాయ మార్గాలను పెంచుకునేలా వివిధ మార్గాలను అన్వేషించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల అభిప్రాయాలను సీఎం తెలుసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హరికృష్ణ మాట్లాడుతూ కరోనా కాలంలో ఇంటి దగ్గర ఉంటూ 8 గంటలు పనిచేస్తూ నెలకు రూ.1.50 లక్షలు సంపాదిస్తున్నట్లు సీఎంకు తెలియజేశారు. సంబేపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శివారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నెలకు రూ.70 వేలు సంపాదిస్తున్నట్లు తెలిపారు. దావోస్ పర్యటనతో ఐదేళ్లలో రాజధానిలో ఐటీ డెవలప్‌మెంట్ చేయాలని తెలియజేశారు. గురిగింజకుంట వాసి శేఖర్‌నాయుడు తొమ్మిదేళ్లగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో రాజకీయంగా గ్రామంలో ఎదుగుతున్నట్లు తెలిపారు. మోటకట్ల శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మీరు వేసిన ఐటీ ప్రాజెక్టులో తొలి మొక్కను నేను అని ప్రస్తుతం నా నెల ఆదాయం రూ.2.50 లక్షల రూపాయలని. వర్క్ ఫ్రం హోం ద్వారా నాకున్న 15 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబసభ్యులకు అండగా ఉన్నట్లు తెలిపారు. తంబళ్లపల్లెకు చెందిన శ్రీవిద్య నిరుపేద కుటుంబం నుంచి ఎన్నో కష్టాలు పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాని తెలిపింది. హరీశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగం నుంచి నెలకు ఒకటిన్నర లక్ష వస్తుందని, దీంతో పాటు గొర్రెల పెంపకం యూనిట్ కూడా పెట్టుకుని అదనపు ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. రెడ్డినడిమిరాజువారిపల్లెకు చెందిన ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ తాను ఇంటి దగ్గరే ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ద్వారా లక్ష పదివేల రూపాయలు సంపాదిస్తూ దీంతో పాటు పదెకరాల్లో టమోటా తోటను కూడా సాగు చేస్తున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లెకు చెందిన వెంకటేశ్ మాట్లాడుతూ రాజకీయంగా ఉండడంతో తనపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారని తెలిపారు. యువత అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆకాశమే హద్దుగా డబ్బు సంపాదించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నన్ను అరెస్టు చేస్తే ఎక్కడా లేని విధంగా నా మీద ప్రేమతో 53 రోజుల పాటు 80 దేశాల్లో రోడ్లపైకి వచ్చి వివిధ కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరం అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఐటీ భవనం నిర్మించేందుకు సాఫ్ట్‌వేర్ రంగానికి తాను చేసిన సేవలను గుర్తు చేశారు. ప్రస్తుతం అమెరికా తలసరి ఆదాయం కన్నా మన తెలుగు యువత ఆదాయం రెండు శాతం అధికంగా ఉందంటే ఐటీ ఉద్యోగాలతోనే సాధ్యమైందన్నారు. ప్రస్తుతం గ్రామీణ యువతకు సైతం అత్యంత సులభతరంగా ఆదాయ వనరుగా మారిన వర్క్ ఫ్రం హోంను కాస్త వర్క్ ఫ్రం నైబర్ హోం విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ముందుగా వివిధ నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న పలువురు సంబేపల్లె మండలంలోని స్థానికుల మనోభావాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

కాపురానికి రాలేదని...

భార్యను నరికిన భర్త

అడ్డొచ్చిన అత్తపైనా దాడి





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య లలితమ్మ, అత్త రాధమ్మ

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటి నుంచి రాకపోవడంతో మద్యం తాగి వెళ్లి గొడవపడ్డాడు. కొడవలితో దాడి చేశాడు. అడ్డొచ్చిన అత్తనూ నరికాడు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం బడన్నపల్లిలో శనివారం చోటుచేసుకున్న ఘటనపై వివరాల్లోకెళితే....

నారాయణస్వామి, రాధమ్మ దంపతుల కూతురు లలితమ్మను కడప జిల్లా పులివెందుల తాలుకా వేముల మండలం భూమయ్యగారిపల్లి వాసి బ్రహ్మయ్య ఆచారికి ఇచ్చి 16 ఏళ్ల కిందట వివాహం చేశారు. విభేదాల కారణంగా ఏడాది కిందట లలితమ్మ పుట్టింటికి వచ్చింది. సంక్రాంతి పండుగ సమయంలో బడన్నపల్లికి వచ్చిన బ్రహ్మయ్య ఆచారి ఇకపై బాగా చూసుకుంటానని నమ్మించాడు. కుమారుడిని పండగకు తీసుకుపోయి, తిరిగి పంపలేదు. దీంతో గత నెల 28న వేముల పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ చేశారు. మూడునెలల తర్వాత లలిత కాపురానికి వస్తుందని, కుమారుడిని ఆమెతో పాటు పంపించాలని పోలీసులు చెప్పి పంపారు. ఈ క్రమంలో శనివారం బ్రహ్మయ్య ఆచారి మద్యం తాగి బడన్నపల్లికి వచ్చాడు. కాపురానికి ఎందుకు రావడం లేదని భార్యతో గొడవపడ్డాడు. వెంట తెచ్చుకున్న కొడవలితో భార్య లలితమ్మ, అత్త రాధమ్మపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ గ్రామస్థులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లలితమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. బ్రహ్మయ్య ఆచారి తన కుమారుడు నవదీప్‌ను బైకుపై ఎక్కించుకుని బత్తలపల్లి వైపు వెళ్లాడని గ్రామస్థులు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



అంగన్వాడీ కేంద్రంలో టీకాల పట్ల అవగాహన కల్పిస్తున్న జిల్లావైద్యాధికారి

వల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్లు, డ్రగ్గిస్ట్ రూములోని మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పీహెచ్‌సీలో మందులు అయినపోయిన వెంటనే తెచ్చుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం గంగాయపల్లె అంగన్వాడీ కేంద్రంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం సందర్శించి అక్కడ గర్భిణులు, బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముందుగా అంటువ్యాధులు రాకుండా వారికి సరైన విధానాలను తెలపాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకుంటే పుట్టిన బిడ్డ పెరుగుదలకు ఉపయోపగుడుతుందన్నారు. కాన్పులను ప్రభుత్వ ఆస్పత్రిలో చేయాలని, రోగులకు వైద్యసేవల గురించి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిడాలమిస్ట్ ఖాజామొహిద్దీన్, జిల్లా సూపర్‌వైజరు రాఘవ, స్థానిక డాక్టరు లక్ష్మీ ప్రసన్న, సీహెచ్‌ఓ వేణుగోపాల్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ సెల్ నూతన కమిటీ ఏర్పాటు



నియామక పత్రం అందిస్తున్న వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ నూతన కమిటీ సభ్యులను నియమించారు. నియామకపు పత్రాన్ని ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, నూతన కమిటీకి అందించారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ జి.విజయభారతి (వాణిజ్య విభాగం, వైవీయూ, కడప) సభ్యులుగా డాక్టర్ కె.లలిత, (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ), డాక్టర్ బి.రెడ్డయ్య (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ టెక్నాలజీ), డాక్టర్ జి.నాగేశ్వర రెడ్డి (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈఈఈ, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొద్దుటూరు), డాక్టర్ ఎన్.గణేష్‌నాయక్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్) నియామకపు పత్రాలు పొందారు. ఈ స్థానంలో పనిచేసిన వారి పదవీకాలం పూర్తవడంతో వీసీ ఉత్తర్వుల మేరకు నూతన నియామకం చేశారు.

చెట్టు మీద పడి వ్యక్తి మృతి



నాగేశ్వరరావు మృతదేహం
(ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

ఖాజీపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చెట్టు కూలడంతో దాసరి నాగేశ్వరరావు (53) మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు బుడ్డాయపల్లె వాసి నాగేశ్వరరావు పనినిమిత్తం భార్యతో కలిసి ఖాజీపేటకు వస్తుండగా ఆరోగ్య కేంద్రం వద్ద ఒక్కసారిగా చెట్టు కూలి పడింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. శ్యామలకు స్వల్ప గాయాలు కావడంతో ఇద్దరినీ చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో నాగేశ్వరరావు మృతిచెందినట్లు వారు తెలిపారు. చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్గి రాసుకుంటూ ఒక్కసారిగా చెట్టు కుప్పకూలింది. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. యజమాని కోల్పోవడంతో పిల్లలు, భార్య బోరున విలపిస్తుండడం చూసిన గ్రామస్థులు కంట తడిపెడుతున్నారు.

వైవీయూ అంతర్‌కళాశాలల క్రీడాపోటీలు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కమలాపురంలోని సీఎస్ఎస్ఆర్‌అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలల్లో 7,8 తేదీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్‌కళాశాలల హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారు. యోగివేమన విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొనే వారు 2024 జులై 1 నాటికి 17ఏళ్ల పైన 25 ఏళ్లలోపు వారై విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో చదువుతూ ఉండాలన్నారు.

వంట మాస్టర్ ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల రోడ్డులోని ఓ మెడికల్ కళాశాల హాస్టల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్న ఎండీ మన్సూర్ ఖాన్(43) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప తాలూకా ఎస్ఐ ప్రదీప్‌నాయుడు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు కాకినాడ వాసి మన్సూర్ అలీ ఖాన్ విద్యార్థినులకు వంట చేసేవాడు. అతని భార్య ఫరియా బాలికల హాస్టల్ వార్డెన్‌గా పనిచేసేది. కొద్ది కాలంగా అనారోగ్యంతోనూ, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

మానసిక ఉల్లాసం కల్పించేందుకే

బాలోత్సవాలు : డీఈఓ



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో మానసిక ఉల్లాసం కల్పించేందుకు బాలోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. శనివారం కడప నగరం సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో డాక్టర్ రాజా వెంగళరెడ్డితో కలిసి జాతీయ పతాకావిష్కరణ చేసిన ఆయన మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులు కల్చరల్ అకాడమీ ప్రోగ్రాంలో పాల్గొనడం ఉత్సాహంగా హాజరవడం ఆనందదాయకమన్నారు. మానసిక వికాసానికి, సైంటిఫిక్ టెంపర్ పెరిగేందుకు మానవతను పెంపొందించుటకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. పిల్లల భవిష్యత్తుకు తోడ్పడేలా కార్యక్రమాలు రూపొందించినందుకు నిర్వాహకులను అభినందించారు. బాలోత్సవం గౌరవ సలహాదారులు వీరసుదర్శన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నాగమునిరెడ్డి, అధ్యక్షులు గుర్రాల గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, ఉపాధ్యాయులు ప్రొఫెసర్ మృత్యుంజయరావు, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఉషాతులసి, సుందరయ్య, డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, మహేష్, ఎంఈఓ పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 12 అంశాలతో సీనియర్స్ జూనియర్స్ సబ్ జూనియర్స్ విభాగాల్లో మొదటి రోజు రెండో పిల్లల పండగ విజయవంతమైంది. జానపద నృత్యం, క్లాసికల్ డ్యాన్స్, దేశభక్తి గీతాలాపన, రైమ్స్, ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ అంశాల్లో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో 965 మంది పాల్గొనగా 12 అంశాల్లో నాలుగు వేదికలపైన నిర్వహించారు. ఆర్గనైజర్లు, కోఆర్డినేటర్లు, న్యాయనిర్ణేతలు, యాంకర్స్ వలంటీర్స్ పాల్గొన్నారు. మట్టిబొమ్మలు సైన్స్ ఎగ్జిబిషన్, వ్యాసరచన, దినపత్రిక పఠణం కథలు చెప్పడం, బెస్ట్ కార్టూన్స్, మెమొరీ టెస్ట్ నిర్వహించారు.

నకిలీ మద్యం రాకెట్ గుట్టురట్టు

ప్రధాన నిందితుడు వెంకటరమణ, మరో ఐదుగురి అరెస్టు ● ఆరు లక్షలు నగదు,కారు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన కడప జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది.

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గత నెల 29న అనంతరాజుపేట పంచాయతీలో జరిగిన నకిలీ మద్యం రాకెట్ గుట్టురట్టు అయింది. ప్రధాన నిందితుడు వెంకటరమణ సహా మరో ఐదుగురిని ఎక్సైజ్ సిబ్బంది అరెస్టు చేశారు. కడప జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి శనివారం రైల్వేకోడూరు ఎక్సైజ్ కార్యాలయంలో వెల్లడించిన వివరాల మేరకు... అనంతరాజుపేట పంచాయతీలో పట్టుబడిన అయ్యప్ప, వెంకట నారాయణ ఇచ్చిన సమాచారం మేరకు తిరుపతి పట్టణం తిరుచానూరు వద్ద దామినేడు ఇందిరమ్మ ఇళ్ల సముదాయంలో బి.బాక్ నెంబరు 61 ఇంట్లో 23 స్పిరిట్ క్యాన్, వివిధ బ్రాండ్లతో ఉన్న 1641 మద్యం సీసాలు, 805 లీటర్లు స్పిరిట్, 34 వేల నకిలీ లేబుల్స్, 1050 నకిలీ మద్యం సీసాలు, ఏడు వేల ఖాళీ సీసాలు మూతలు, ముడిపదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మద్యం రవాణా కోసం ఉపయోగించిన కారు, ఆరు లక్షల రూపాయలు నగదు స్వాధీనం చేసుకుని ప్రధాన నిందితుడు వెంకటరమణ, అతనికి సహకరించిన అతని బంధువు జయబాబును, చికెన్ శ్రీను, మహేశ్వరను అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం లభించిన సమాచారం మేరకు నకిలీ లేబుల్స్ తయారు చేస్తున్న ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడుకు చెందిన శివశంకర్ ఫొటో స్టూడియో యజమాని శివ శంకర్ నాయుడును అరెస్టు చేశారు. శివ శంకర్‌కు సహకరిస్తూ చిన్నఓరంపాడులో బెల్టు షాపు నిర్వహిస్తున్న నరసింహను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి స్పిరిట్ సరఫరా చేస్తున్న చరణ్‌జీత్ సింగ్, సీసా మూతలు సరఫరా చేస్తున్న అక్షయ్ పరారీలో ఉన్నారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదు స్పిరిట్, ముడిపదార్థాలు విలువ రూ.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో రాయచోటి టాస్క్‌ఫోర్స్ సీఐ ఎల్లయ్య, కోడూరు సీఐ తులసి, తిరుపతి ఎక్సైజ్ సీఐలు శ్యామ్ నాయుడు, నరసనాయుడు, రామచంద్ర కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠారెడ్డి, తిరుపతి ఎస్ఐలు స్వామినాథన్, హరికృష్ణ, జయశంకర్, మహేష్, కవీశ్వరనాయుడు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ట్రావెల్స్ బస్సు ఢీ - ఒకరు మృతి

ప్రమాదంలో మరో ఆరుగురికి గాయాలు



సంఘటన స్థలంలో బోల్తాపడిన ఆటో, గాయాలపాలైన కూలీలు

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నేలతిమ్మాయగారిపల్లె సమీపంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆటోను ఢీకొట్టింది. ముకుంద ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి వేంపల్లెకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకెళితే... వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కూలీలు ఆటోలో ఎర్రగుంట్లకు వెళ్తుండగా నేలతిమ్మయ్యగారిపల్లె వద్ద హైదరాబాద్ నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఆంజనేయులు, శ్రీనివాసులు, అంజనమ్మ, లక్ష్మయ్య, వీరయ్య, రమణమ్మ, చిన్నరాయుడుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరయ్య (7) మృతిచెందాడు. ఆంజనేయులు పరిస్థితి విషమసంఘటన స్థలాన్ని వీరపునాయునిపల్లె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

భారీ స్కోర్ దిశగా ఆంధ్ర

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర- హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రజట్టు భారీ స్కోర్ దిశగా సాగుతోంది. కడప నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకేనాయుడు ట్రోఫీ అండర్ 23 మల్టీడేస్ నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా శనివారం ఆంధ్ర- హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ నెగ్గిన ఆంధ్ర జట్టు బ్యాటింగ్ ఎంచుకుని మొదటిరోజు ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో కేవలం 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 360 పరుగులు భారీ స్కోరు సాధించింది. ఇందులో హేమంత్ రెడ్డి ఏకంగా 136 పరుగులు చేయగా, మరో బ్యాట్స్‌మెన్ వెంకటరాహుల్ 162 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

56 మద్యం బాటిళ్లు స్వాధీనం

లింగాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అంబకపల్లెలో బెల్టుషాపుపై దాడి చేసి 56 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ రమణ, ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. పులివెందుల రూరల్ సీఐ రమణ ఆదేశాల మేరకు బెల్టుషాపు నిర్వహిస్తున్న శివగంగిరెడ్డిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

'వాకర్స్' కేబినెట్ డైరెక్టర్‌గా మన్నెం రామ్మోహన్



నందలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 302 కేబినెట్ డైరెక్టర్లుగా మన్నెం రామ్మోహన్, కుర్రా మణియాదవ్ ఎంపికయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ (రాయలసీయ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అండమాన్, పుదుచ్చేరి) డిస్ట్రిక్ట్ 302 క్లబ్ 2025 నూతన కార్యవర్గం సమావేశం శనివారం పుత్తూరు వాకర్స్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మన్నెం రామ్మోహన్ మాట్లాడుతూ 2025 సంవత్సరానికి వాకర్స్ నూతన గవర్నర్‌గా ఆర్.మాధవనాయుడు ప్రమాణస్వీకారం చేశారన్నారు. తదుపరి నందలూరు వాకర్స్‌క్లబ్ సేవలను గుర్తించి శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్, వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్టు బోర్డుమెంబరు కొండూరు శరత్‌కుమార్‌రాజు ప్రోత్సాహంతో వాకర్స్ ఇంటర్నేషనల్ కేబినెట్‌కు నందలూరు వాకర్లను ఎంపిక చేశారన్నారు. తమను ఎంపికచేసిన వాకర్స్ గవర్నర్ మాధవనాయుడు, కొండూరు శరత్ కుమార్‌రాజుకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిట్వేలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటచలపతి శనివారం సాయంత్రం తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద లైను మార్పు ఉన్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండని రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలకు కంచె ఏర్పాటు

పుల్లంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కృష్ణంపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో శనివారం పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ వేయించినట్లు ప్రధానో పాధ్యాయుడు సీవీ రమణమూర్తి తెలిపారు. గ్రామ పెద్దలు చలపతి, శివకృష్ణ, కృష్ణ కుమార్, మురళీతో కలిసి 50 వేల రూపాయలు ఖర్చు పెట్టి ఈ కార్యక్రమం నిర్వహించారు.

చంద్రబాబు సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు

గాలివీడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు భారీ ఎత్తున తరలి వెళ్లారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డిల పిలుపు మేరకు మండలంలోని 17 పంచాయతీల నుంచి వివిధ వాహనాల్లో తరలివెళ్లారు.

ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్లో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికల ఫుట్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహించారు. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు, మున్సిపల్ ఉర్దూ స్కూల్ జట్ల మధ్య, శ్రీవేద, వశిష్ట హైస్కూళ్ల జట్ల మధ్య, సీటీఎం, చెంబకూరు జడ్పీహైస్కూల్ జట్ల మధ్య లీగ్ పోటీలు నిర్వహించారు.

రేపు నాగబింబ ప్రతిష్ఠ

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్లపల్లె పంచాయతీ కొత్తపల్లెలో గ్రామస్థుల సహకారంతో నిర్మించిన నాగ బింబ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటలకు గణపతి పూజ, స్వస్తి వాచనం,సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల మధ్య విగ్రహ ప్రతిష్ఠ, నవగ్రహ హోమం, ప్రాణప్రతిష్ఠ అభిషేకం, అలంకార కార్యక్రమాలు జరుగుతాయ న్నారు. 9 గంటలకు అశ్వర్థ కల్యాణం పూర్ణాహుతి ఉంటాయన్నారు.

ఉలవ రైతు పంట పండింది!

● అనుకూలించిన వర్షాలు ● ప్రోత్సహించిన అధికారులు



సాగులో ఉన్న ఉలవ పైరు

సంబేపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రైతులు మెట్ట పొలాల్లో సాగుచేసిన ఉలవ పైరు వాతావరణం అనుకూలించడంతో సత్ఫలితాన్నిచ్చింది.. రాయచోటి నియోజకవర్గంలోని మెట్ట పొలాల్లో వర్షాధారం కింద రైతులు వేరుశనగ సాగు చేస్తారు. ప్రకృతి విపత్తులు, తెగుళ్ల కారణంగా ప్రతి ఏడాది నష్టాలే తప్ప లాభమన్నది చూసి ఎరుగరు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించింది. జిల్లాలోని వ్యవసాయాధికారులు సబ్సిడీపై ఉలవ విత్తనాలు అందించారు. దీంతో సంబేపల్లె మండలంలో ఈ ఏడాది 1862 హెక్టార్లలో రైతులు ఉలవ సాగు చేశారు. నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు అనుకూలంగా పడడంతో ఉలవ పంట పండింది. ప్రస్తుతం ఉలవ నూర్పిళ్లలో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు. దీంతో కూలీలకు పెద్ద డిమాండ్ ఏర్పడింది. ఒక రోజుకు రూ.500 కూలి అందుతుండడంతో కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉలవ క్వింటా ధర రూ.4 వేలు ఉండడంతో ఆశించిన రీతిలో ఆదాయం వస్తుందని రైతులు భావిస్తున్నారు.

దిగుబడి వస్తేనే సంతోషం



వ్యవసాయంలో ఆశించిన దిగుబడి వచ్చినప్పుడే సంతోషం వస్తుంది. నష్టాలు వస్తే పంట సాగు చేయా లంటేనే భయమేస్తుంది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట నష్టాన్ని గుర్తించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. రైతు బాగుంటేనే సమాజం బాగుంటుంది.

- సహదేవ, రైతు, పెద్దజంగంపల్లి, దుద్యాల

ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

● ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్ సబ్ స్టాఫ్ దీక్షలకు ఎస్‌ఎఫ్ఐ మద్దతు



ఏపీఎండీసీ కార్మికుల నిరసనకు మద్దతు తెలుపుతున్న విద్యార్థి సంఘాలు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మంగంపేట ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్ సబ్ స్టాఫ్ తొలగింపునకు నిరసిస్తూ చేస్తున్న రిలే దీక్షలకు భారత విద్యార్థి ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కమిటీ సభ్యుడు దివన్‌కుమార్ ప్రకటించారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ గేటు వద్ద ఏర్పాటు చేసిన శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ ఉషోదయ ఎడ్యుకేషన్ కాంట్రాక్టర్ స్కూల్ సబ్‌స్టాఫ్‌కు జీతాలు ఇవ్వకపోవడంతోపాటు, డ్యూటీకి రావద్దని గెంటివేయం చాలా దుర్మార్గమన్నారు. తక్షణం వారిని విధుల్లోకి తీసుకోకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పాఠశాల నిర్వాహకులు నిబంధనలు పాటిండం లేదని తెలిపారు. 30 మందికి కేటాయించిన తరగతి గదులో 50 మంది పైగా కూర్చొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన పుస్తకాలకు 6, 7 వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. పాఠశాల నిర్వహణకు ఏడాదికి 3 కోట్లకు పైగా సీఎస్ఆర్ నిధులను ఏపీఎండీసీ యాజమాన్యం వెచ్చిస్తుండగా, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బు ఎందుకు వసూలు చేస్తున్నారో చెప్పాలన్నారు. స్కూలు బస్సుల కండిషన్‌పై విచారణ చేయాలన్నారు. పిల్లలకు ఏమైనా ప్రమాదం జరిగితే ఏపీఎండీసీ యాజమాన్యం బాధ్యత వహించాలని హెచ్చరించారు. టెండరు లేకుండా అక్రమంగా తెలంగాణ నేతకు కాంట్రాక్టు కట్టబెట్టారని విమర్శించారు. కనీస ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌ను రద్దు చేయాలన్నారు. సమస్యలపై మాట్లాడటానికి వెళితే అడ్డుకున్నారని తక్షణమే డీఈవో, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పందికాళ్ల మణి, విద్యార్థి నాయకులు, విజయ్‌నాయక్, ఉపేంద్ర, సురేష్, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ ప్రదర్శిస్తే ఉద్యోగావకాశాలు



బహుమతులందజేస్తున్న ఎంవీఐ వినోద్‌కుమార్, శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ ప్రదర్శిస్తే ఉద్యోగావకాశాలు వెతుక్కుంటూ వస్తాయని మోటారు వాహనాల తనిఖీ అధికారి వినోద్‌కుమార్ అన్నారు మండలంలోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీ విజేతలకు శనివారం ఆయన బహుమతులు పంపిణీ చేశారు. రాజంపేట మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా నైపుణ్యంతో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చునన్నారు. శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు, సీఈవో శంకర్‌రాజు, ప్రిన్సిపాల్ విజయ నిర్మల, వైస్ ప్రిన్సిపాల్ జయశ్రీ తదితరులు మాట్లాడుతూ తమ పాఠశాలలో 3 రోజులుగా 12 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్ పంపిణీ



పరీక్ష కిట్‌తో విద్యార్థులు

నందలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల జీవితంలో ప్రధాన మలుపుగా నిలుస్తుందని విశ్రాంత ఉపాధ్యాయుడు పుల్లయ్య కుమారుడు వరప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన టంగుటూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందరూ మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గర్వకారణంగా నిలవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మస్తానయ్య, రమేష్‌బాబు, గణేష్‌బాబు, శశికళ, లక్ష్మీదేవి, రేబియా బేగం , విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రకాళి, వీరభద్రుల సన్నిధిలో కెనరా బ్యాంకు మేనేజర్



ఆలయంలో పూజల అనంతరం సిబ్బందితో కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ మురళీమోహన్

చిట్వేలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పాత చిట్వేలిలోని భద్రకాళి సమేత వీరభద్రాలయాన్ని శనివారం కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ మురళీమోహన్, డివిజనల్ మేనేజర్, ప్రాంతీయ మేనేజర్, సిబ్బంది సందర్శించారు. వేదపండితులు వీరిని ఆశీర్వదించగా ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు మృత్యుంజయశర్మ, తిరుమలరెడ్డయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలను ఆదుకోవాలి

● ముఖ్యమంత్రికి రైల్వే కోడూరు నియోజకవర్గ నాయకుడి వినతి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలను ఆదుకుని, కాపాడాలని సీనియర్ నాయకుడు రెడ్డయ్య నాయుడు ముఖ్యమంత్రికి విన్నవించారు. శనివారం సంబేపల్లెకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసి ఈ మేరకు విన్నవించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే కోడూరులో తెలుగుదేశంపార్టీ స్థితిగతులపై సుమారు 12 పేజీల వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి ఇచ్చామని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, చాలా మంది సీనియర్లను పక్కన పెట్టేశారని, దీంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారని విన్నవిం చామని తెలిపారు. ఎన్నికల్లో కలసికట్టుగా పని చేసి జనసేన పార్టీ అభ్యర్థిని గెలిపించామని తెలిపారు. గెలిచిన నాయకులు ఆ తర్వాత కార్యకర్తలను, నాయకులను విస్మరించారని విన్నవించామని తెలిపారు. దీన్ని పరిశీలించి తమకు న్యాయం చేయాలని తెలిపామన్నారు. తమను ఏ కార్యక్రమాలకు పిలవడం లేదని, మా సొంత గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నా పిలుపు లేదన్నారు. కనీస గౌరవం లేకుండా పోవడంతో టీడీపీ పట్టు కోల్పోతుందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌తో అన్ని వర్గాలకు సమన్యాయం

● హర్షం వ్యక్తం చేసిన బీజేపీ నేతలు

రాజంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్ అన్నివర్గాలకు సమన్యాయం చేసే బడ్జెట్ అని అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్ కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ బడ్జెట్ పేద, మధ్య తరగతి, అట్టడుగు వర్గాలవారికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాలు జల్లు కురిపించారన్నారు. 12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు మధ్య తరగతి కుటుంబీకులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితి రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంపు రైతులకు ఆసరాగా అవుతుందన్నారు. ఉడాన్ పథకం ద్వారా 120 కొత్త పట్టణాలకు, గ్రామాలను అనుసంధానించడంతో దేశంలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. 36 రకాల కీలక ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడంతో పాటు ప్రతి జిల్లాలోను కేన్సర్ కేర్ కేంద్రాలను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఔషధాలు సామాన్యులకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ బడ్జెట్ స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇది ఆంధ్ర రాష్ట్రానికి వరంలాంటి బడ్జెట్ అన్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని కూడా స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడానికి బడ్జెట్‌లో వరాలజల్లు కురిపించారని హర్షం వ్యక్తం చేశారు.

నందలూరు : రాజంపేట బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ అరిగె రాంప్రసాద్ మాట్లాడుతూ 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు , ఐదేళ్లలో 75 వేల మెడికల్ సీట్ల పెంపు, 100 విమానాశ్రయాల ఏర్పాటు ,కార్మికులకు హెల్త్‌కార్డులు స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహకం లాంటి నిర్ణయాలు తీసుకోవడం శుభపరిణామమన్నారు. రాజంపేటలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు సుండుపల్లెలో రాజంపేట అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ రామాజగదీశ్,జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సునీత నారాయణ వర్మ తదితరులు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యాలను నెరవేరుస్తుందన్నారు.

రాజంపేట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

● సీఎంకు సుగవాసి బాలసుబ్రమణ్యం వినతి

రాజంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని, ఇక్కడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సంబేపల్లెలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వినతిపత్ర సమర్పించినట్లు రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలస్రుబ్రమణ్యం తెలిపారు. టీడీపీ సభ్యత్వాల్లో రాష్ట్రంలోనే రాజంపేట నియోజకవర్గం ముందు స్థానంలో ఉన్న విషయాన్ని వినతిపత్రంలో గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి జీవనాడి అయిన అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి మూడేళ్లు దాటినా, దాని పునరుద్ధరణ అంశాన్ని ఎవరూ పట్టించుకోలేదని, వెంటనే ఈ ప్రాజెక్టును పునర్నిర్మించాలని కోరారు. గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు రాజంపేటను జిల్లా కేంద్రం చేసి ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. రాజంపేట పట్టణంలో కనీస అభివృద్ధి లేదని, పట్టణానికి ప్రత్యేక నిధులు కేటాయించి రాజంపేటకు బైపాస్ రింగ్‌రోడ్డు, పట్టణంలో రోడ్లు వెడల్పు చేయాలన్నారు. గత జగన్‌హయాంలో రాజంపేటకు కేటాయించిన మెడికల్ కళాశాలను మదనపల్లెకు తరలించారని, వెంటనే రాజంపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. కడప - రేణిగుంట ఆరు లైన్ల రోడ్డును వెంటనే ప్రారంభించాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, చేనేత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నియోజకవర్గానికి ప్రత్యేక ప్యాకేజి ప్రకటించి అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎన్వీ రమణ, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వరు నాయుడు, మైనార్టీ నాయకులు సయ్యద్ షామీర్‌బాషా, టీడీపీ నేతలు మేకా నరసింహులు, చెంగల్‌రాయుడు, దగ్గుపాటి రవి, జనసేన నాయకులు అబ్బిగారి గోపాల్ తదితరులు పాల్గొన్నట్లు వివరించారు..

జడ్పీ హైస్కూల్‌లో డీఈవో ఆకస్మిక తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో షంషుద్దీన్

సిద్దవటం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షంషుద్దీన్ రికార్డులు, ఉపాధ్యాయుల హాజరు, మెనూ తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా ఉపా ధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు పనివేళలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు, మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపం లేకుండా చూడాలన్నారు. వంటగదిలో అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. మెనూ ప్రకారం క్రమం తప్పకుండా భోజనం అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు ఇక సులభతరం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపు ఇక సులభతరమైందని రైల్వేకోడూరు ఏడీఈ భాస్కర్‌రావు, ఏఈ సుబ్రహ్మణ్యంలు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులో క్యూఆర్ కోడ్‌ను పొందుపరిచి ఉంటారని తెలిపారు. దాన్ని యూపీఐ యాప్‌లో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీయం, అమేజాన్ పే తదితర వాటిల్లో ఓపెన్ చేసి క్యూఆర్‌కోడ్ ను స్కాన్ చేసి సులభంగా బిల్లులు చెల్లించే అవకాశాన్ని విద్యుత్ శాఖ కల్పించిందన్నారు. విద్యుత్ బిల్లులను 15 రోజుల్లో చెల్లించాలన్నారు. అలా చెల్లించకపోతే మాత్రం సర్‌చార్జి చెల్లించాల్సి ఉంటుందన్నారు. బిల్లులో క్యూఆర్ కోడ్ చెరిగిపోకుండా ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

4 నుంచి భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



భోగాంజనేయస్వామి ఆలయం

నందలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుంపిణీపురంలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు భోగాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. మంగళవారం ఉదయం స్వామికి అభిషేకం, గరుడసేవ, ప్రసాద వినియోగం, రాత్రి ఆర్కెస్ట్రా, బుధవారం ఉదయం పూ జలు, గ్రామోత్సవం, మధ్యాహ్న అన్నదానం, సాయంత్రం అశ్వ వాహనంపై స్వామివారి ఊరేగింపు, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, గురువారం ఉదయం రథోత్సవం ఉంటుందని, నిర్వాహకుడు డాక్టర్ గణపతి శంకర్, సంభావు చంద్రశేఖర్ తెలిపారు.

'వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించాలి'

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 5న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు శనివారం ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ ఖలీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును టీడీపీ వ్యతిరేకించాలని ఆయన కోరారు. ,3 కోట్ల మంది ముస్లింలు వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరే కించినా కేంద్ర ప్రభుత్వం ముస్లిం, మైనార్టీల అభిప్రాయాలను పట్టించు కోవడం లేదన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఐక్యవేదిక తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే ఈ బిల్లును వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరారు. బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందితే ముస్లింల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

సుండుపల్లెలో సమస్యలను పరిష్కరించాలి

సుండుపల్లె, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రాన్ని అందజేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కళ్లె రెడ్డెప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోళ్లమడుగు నుంచి 2018లో ప్రారంభించిన తాగునీటి పథకాన్ని పూర్తి చేయాలని, ఝరికోన ప్రాజెక్టు నుంచి కాలువలు తగ్గించి రైతులకు సాగునీటిని అందించాలని, సుండు పల్లె డబుల్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

'బాలికలకు విద్య ఎంతో అవసరం'



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి ఫైజున్నీసా

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాలికలకు విద్య ఎంతో అవసరమని లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా తెలిపారు. శనివారం స్థానిక ఏపీ మో డల్ స్కూల్‌లో మండల లీ గల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో 9, 10, ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలికా విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల అభ్యున్నతికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయన్నారు. బాల్య వివాహాలు నేరమని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యతో పాటు మంచి ఆహారం కూడా ఎంతో అవసరమన్నారు. పిల్లలకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని వంట ఏజెన్సీకి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంభాభిషేక ఉత్సవాలకు ప్రసాద్‌బాబుకు ఆహ్వానం



సుగవాసి ప్రసాద్‌బాబును ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం పునర్నిర్మాణం, విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలకు టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబుకు ఆహ్వానం అందింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు పబ్బిశెట్టి సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శనివారం ఆయనను కలిసి ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించినున్న మహాకుంభాభిషేక ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు.

'వేల గొంతులు.. లక్ష డప్పులు విజయవంతం చేయండి'



డప్పులు వాయిస్తూ ఐక్యత చాటుతున్న ఎంఆర్‌పీఎస్ నేతలు, కార్యకర్తలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 7 న హైదరాబాదులోనిర్వహించనున్న వేల గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంఆర్‌పీఎస్ రాయచోటి నియోజకవర్గ కోఆర్డినేటర్ గుంటిమడుగు ఆనంద్‌మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి కాటిమాయ కుంట హరిజనవాడలో ఆనంద్ ఆధ్వ ర్యంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ కార్యకర్తల తో కలిసి డప్పులు వాయిస్తూ పాటలతో కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కమిటీ సభ్యులు శివ, కుమార్, సహదేవ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో మల్‌రెడ్డి తెలిపారు. కాపు, ఓబీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీ అభ్యర్థులు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని వివరించారు. ఆసక్తి కలిగిన అర్హులైన యువత ఏపీఓబీఎంఎం ఎస్‌ఏపీసీఎఫ్‌ఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

100 దేశాల్లో 'సాఫ్ట్‌వేర్'లో మనవారే...

● ఐటీ రంగాన్ని యువతకు అందించాం ● ఆకాశమే హద్దుగా డబ్బులు సంపాదిస్తున్నారు
● సాఫ్ట్‌వేర్‌తో పాటు యువతను రాజకీయంగా ప్రోత్సహిస్తాం ● ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



అన్నమయ్య జిల్లా సంబేపల్లెలో జరిగిన ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు - సీఎంతో మాట్లాడుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

సంబేపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల్లో మన తెలుగు వారు, భారతీయులు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. సంబేపల్లెలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబును సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కలిశారు. వారితో సీఎం మాట్లాడుతూ యువతకు టెక్నాలజీని పరిచయం చేశాం, హైటెక్ సిటీ కట్టాం, హైటెక్ టవర్ ఏర్పాటు చేశాం. ఐటీ చదువుకోవాలని ఆశ పుట్టించాం. దీంతో ప్రస్తుతం యువత సాఫ్ట్‌వేర్ రంగంలో సంపాదిస్తూ ఆదాయ మార్గాలను పెంచుకునేలా వివిధ మార్గాలను అన్వేషించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల అభిప్రాయాలను సీఎం తెలుసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హరికృష్ణ మాట్లాడుతూ కరోనా కాలంలో ఇంటి దగ్గర ఉంటూ 8 గంటలు పనిచేస్తూ నెలకు రూ.1.50 లక్షలు సంపాదిస్తున్నట్లు సీఎంకు తెలియజేశారు. సంబేపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శివారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నెలకు రూ.70 వేలు సంపాదిస్తున్నట్లు తెలిపారు. దావోస్ పర్యటనతో ఐదేళ్లలో రాజధానిలో ఐటీ డెవలప్‌మెంట్ చేయాలని తెలియజేశారు. గురిగింజకుంట వాసి శేఖర్‌నాయుడు తొమ్మిదేళ్లగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో రాజకీయంగా గ్రామంలో ఎదుగుతున్నట్లు తెలిపారు. మోటకట్ల శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మీరు వేసిన ఐటీ ప్రాజెక్టులో తొలి మొక్కను నేను అని ప్రస్తుతం నా నెల ఆదాయం రూ.2.50 లక్షల రూపాయలని. వర్క్ ఫ్రం హోం ద్వారా నాకున్న 15 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబసభ్యులకు అండగా ఉన్నట్లు తెలిపారు. తంబళ్లపల్లెకు చెందిన శ్రీవిద్య నిరుపేద కుటుంబం నుంచి ఎన్నో కష్టాలు పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాని తెలిపింది. హరీశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగం నుంచి నెలకు ఒకటిన్నర లక్ష వస్తుందని, దీంతో పాటు గొర్రెల పెంపకం యూనిట్ కూడా పెట్టుకుని అదనపు ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. రెడ్డినడిమిరాజువారిపల్లెకు చెందిన ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ తాను ఇంటి దగ్గరే ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ద్వారా లక్ష పదివేల రూపాయలు సంపాదిస్తూ దీంతో పాటు పదెకరాల్లో టమోటా తోటను కూడా సాగు చేస్తున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లెకు చెందిన వెంకటేశ్ మాట్లాడుతూ రాజకీయంగా ఉండడంతో తనపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారని తెలిపారు. యువత అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆకాశమే హద్దుగా డబ్బు సంపాదించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నన్ను అరెస్టు చేస్తే ఎక్కడా లేని విధంగా నా మీద ప్రేమతో 53 రోజుల పాటు 80 దేశాల్లో రోడ్లపైకి వచ్చి వివిధ కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరం అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఐటీ భవనం నిర్మించేందుకు సాఫ్ట్‌వేర్ రంగానికి తాను చేసిన సేవలను గుర్తు చేశారు. ప్రస్తుతం అమెరికా తలసరి ఆదాయం కన్నా మన తెలుగు యువత ఆదాయం రెండు శాతం అధికంగా ఉందంటే ఐటీ ఉద్యోగాలతోనే సాధ్యమైందన్నారు. ప్రస్తుతం గ్రామీణ యువతకు సైతం అత్యంత సులభతరంగా ఆదాయ వనరుగా మారిన వర్క్ ఫ్రం హోంను కాస్త వర్క్ ఫ్రం నైబర్ హోం విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ముందుగా వివిధ నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న పలువురు సంబేపల్లె మండలంలోని స్థానికుల మనోభావాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

కాపురానికి రాలేదని...

భార్యను నరికిన భర్త

అడ్డొచ్చిన అత్తపైనా దాడి





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య లలితమ్మ, అత్త రాధమ్మ

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటి నుంచి రాకపోవడంతో మద్యం తాగి వెళ్లి గొడవపడ్డాడు. కొడవలితో దాడి చేశాడు. అడ్డొచ్చిన అత్తనూ నరికాడు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం బడన్నపల్లిలో శనివారం చోటుచేసుకున్న ఘటనపై వివరాల్లోకెళితే....

నారాయణస్వామి, రాధమ్మ దంపతుల కూతురు లలితమ్మను కడప జిల్లా పులివెందుల తాలుకా వేముల మండలం భూమయ్యగారిపల్లి వాసి బ్రహ్మయ్య ఆచారికి ఇచ్చి 16 ఏళ్ల కిందట వివాహం చేశారు. విభేదాల కారణంగా ఏడాది కిందట లలితమ్మ పుట్టింటికి వచ్చింది. సంక్రాంతి పండుగ సమయం లో బడన్నపల్లికి వచ్చిన బ్రహ్మయ్య ఆచారి ఇకపై బాగా చూసుకుంటానని నమ్మించాడు. కుమారుడిని పండగకు తీసుకుపోయి, తిరిగి పంపలేదు. దీంతో గత నెల 28న వేముల పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ చేశారు. మూడునెలల తర్వాత లలిత కాపురానికి వస్తుందని, కుమారుడిని ఆమెతో పాటు పంపించాలని పోలీసులు చెప్పి పంపారు. ఈ క్రమంలో శనివారం బ్రహ్మయ్య ఆచారి మద్యం తాగి బడన్నపల్లికి వచ్చాడు. కాపురానికి ఎందుకు రావడం లేదని భార్యతో గొడవపడ్డాడు. వెంట తెచ్చుకున్న కొడవలితో భార్య లలితమ్మ, అత్త రాధామ్మపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ గ్రామస్థులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లలితమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. బ్రహ్మయ్య ఆచారి తన కుమారుడు నవదీప్‌ను బైకుపై ఎక్కించుకుని బత్తలపల్లి వైపు వెళ్లాడని గ్రామస్థులు తెలిపారు.

ప్లేస్‌మెంట్ సెల్ నూతన కమిటీ ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ నూతన కమిటీ సభ్యులను నియమించారు. నియామకపు పత్రాన్ని ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, నూతన కమిటీకి అందించారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ జి.విజయ భారతి (వాణిజ్య విభాగం, వైవీయూ, కడప) సభ్యులుగా డాక్టర్ కె.లలిత, (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ), డాక్టర్ బి.రెడ్డయ్య (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ టెక్నాలజీ), డాక్టర్ జి.నాగేశ్వర రెడ్డి (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈఈఈ, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొద్దుటూరు), డాక్టర్ ఎస్.గణేష్‌నాయక్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్) నియామకపు పత్రాలు పొందారు. ఈ స్థానంలో పనిచేసిన వారి పదవీకాలం పూర్తవడంతో వీసీ నూతన నియామకం చేశారు.

చెట్టు మీద పడి వ్యక్తి మృతి

ఖాజీపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చెట్టు కూలడంతో దాసరి నాగేశ్వరరావు (53) మృతిచెందాడు. బంధువుల కథనం మేరకు బుడ్డాయపల్లె వాసి నాగేశ్వరరావు పనినిమిత్తం భార్యతో కలిసి ఖాజీపేటకు వస్తుండగా ఆరోగ్య కేంద్రం వద్ద ఒక్కసారిగా చెట్టు కూలి పడింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. శ్యామలకు స్వల్ప గాయాలు కావడంతో ఇద్దరినీ చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో నాగేశ్వరరావు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలున్నారు.

'బాలికలకు విద్య ఎంతో అవసరం'

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాలికలకు విద్య ఎంతో అవసరమని లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా తెలిపారు. శనివారం స్థానిక ఏపీ మో డల్ స్కూల్‌లో మండల లీ గల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో 9, 10, ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలికా విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల అభ్యున్నతికి ప్రభు త్వాలు పెద్దపీట వేస్తున్నాయన్నారు. బాల్య వివా హాలు నేరమని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యతో పాటు మంచి ఆహారం కూడా ఎంతో అవసరమన్నారు. పిల్లలకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని వంట ఏజన్సీకి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలను ఆదుకోవాలి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలను ఆదుకుని, కాపాడాలని సీనియర్ నాయకుడు రెడ్డయ్య నాయుడు ముఖ్యమంత్రికి విన్నవించారు. శనివారం సంబేపల్లెకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డును కలసి ఈ మేరకు విన్నవించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే కోడూరులో తెలుగుదేశం పార్టీ స్థితిగతులపై సుమారు 12 పేజీల వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి ఇచ్చామని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, చాలా మంది సీనియర్లను పక్కన పెట్టేశారని, దీంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారని విన్నవించామని తెలిపారు. ఎన్నికల్లో కలసి కట్టుగా పని చేసి జనసేన పార్టీ అభ్యర్థిని గెలిపించామని తెలిపారు. దీన్ని పరిశీలించి తమకు న్యాయం చేయాలని తెలిపామన్నారు.

మానసిక ఉల్లాసం కల్పించేందుకే

బాలోత్సవాలు : డీఈఓ



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో మానసిక ఉల్లాసం కల్పించేందుకు బాలోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. శనివారం కడప నగరం సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో డాక్టర్ రాజా వెంగళరెడ్డితో కలిసి జాతీయ పతాకావిష్కరణ చేసిన ఆయన మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులు కల్చరల్ అకాడమీ ప్రోగ్రాంలో పాల్గొనడం ఉత్సాహంగా హాజరవడం ఆనందదాయకమన్నారు. మానసిక వికాసానికి, సైంటిఫిక్ టెంపర్ పెరిగేందుకు మానవతను పెంపొందించుటకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. పిల్లల భవిష్యత్తుకు తోడ్పడేలా కార్యక్రమాలు రూపొందించినందుకు నిర్వాహకులను అభినందించారు. బాలోత్సవం గౌరవ సలహాదారులు వీరసుదర్శన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నాగమునిరెడ్డి, అధ్యక్షులు గుర్రాల గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, ఉపాధ్యాయులు ప్రొఫెసర్ మృత్యుంజయరావు, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఉషాతులసి, సుందరయ్య, డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, మహేష్, ఎంఈఓ పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 12 అంశాలతో సీనియర్స్ జూనియర్స్ సబ్ జూనియర్స్ విభాగాల్లో మొదటి రోజు రెండో పిల్లల పండగ విజయవంతమైంది. జానపద నృత్యం, క్లాసికల్ డ్యాన్స్, దేశభక్తి గీతాలాపన, రైమ్స్, ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ అంశాల్లో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో 965 మంది పాల్గొనగా 12 అంశాల్లో నాలుగు వేదికలపైన నిర్వహించారు. ఆర్గనైజర్లు, కోఆర్డినేటర్లు, న్యాయనిర్ణేతలు, యాంకర్స్ వలంటీర్స్ పాల్గొన్నారు. మట్టిబొమ్మలు సైన్స్ ఎగ్జిబిషన్, వ్యాసరచన, దినపత్రిక పఠనం కథలు చెప్పడం, బెస్ట్ కార్టూన్స్, మెమొరీ టెస్ట్ నిర్వహించారు.

నకిలీ మద్యం రాకెట్ గుట్టురట్టు

ప్రధాన నిందితుడు వెంకటరమణ, మరో ఐదుగురి అరెస్టు ● ఆరు లక్షలు నగదు,కారు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన కడప జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది.

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గత నెల 29న అనంతరాజు పేట పంచాయతీలో జరిగిన నకిలీ మద్యం రాకెట్ గుట్టురట్టు అయింది. ప్రధాన నిందితుడు వెంకటరమణ సహా మరో ఐదుగురిని ఎక్సైజ్ సిబ్బంది అరెస్టు చేశారు. కడప జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి శనివారం రైల్వేకోడూరు ఎక్సైజ్ కార్యాలయంలో వెల్లడించిన వివరాల మేరకు... అనంతరాజుపేట పంచాయతీలో పట్టుబడిన అయ్యప్ప, వెంకట నారాయణ ఇచ్చిన సమాచారం మేరకు తిరుపతి పట్టణం తిరుచానూరు వద్ద దామినేడు ఇందిరమ్మ ఇళ్ల సముదాయంలో బి.బ్లాక్ నెంబరు 61 ఇంట్లో 23 స్పిరిట్ క్యాన్, వివిధ బ్రాండ్లతో ఉన్న 1641 మద్యం సీసాలు, 805 లీట్లరు స్పిరిట్, 34 వేల నకిలీ లేబుల్స్, 1050 నకిలీ మద్యం సీసాలు, ఏడు వేల ఖాళీ సీసాలు మూతలు, ముడిపదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మద్యం రవాణా కోసం ఉపయోగించిన కారు, ఆరు లక్షల రూపాయలు నగదు స్వాధీనం చేసుకుని ప్రధాన నిందితుడు వెంకటరమణ, అతనికి సహకరించిన అతని బంధువు జయబాబును, చికెన్ శ్రీను, మహేశ్వరను అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం లభించిన సమాచారం మేరకు నకిలీ లేబుల్స్ తయారు చేస్తున్న ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడుకు చెందిన శివశంకర్ ఫొటో స్టూడియో యజమాని శివ శంకర్ నాయుడును అరెస్టు చేశారు. శివ శంకర్‌కు సహకరిస్తూ చిన్నఓరంపాడులో బెల్టు షాపు నిర్వహిస్తున్న నరసింహను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. హైదారాబాద్ నుంచి స్పిరిట్ సరఫరా చేస్తున్న చరణ్‌జీత్ సింగ్, సీసా మూతలు సరఫరా చేస్తున్న అక్షయ్ పరారీలో ఉన్నారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదు స్పిరిట్, ముడిపదార్థాలు విలువ రూ.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో రాయచోటి టాస్క్‌ఫోర్స్ సీఐ ఎల్లయ్య, కోడూరు సీఐ తులసి, తిరుపతి ఎక్సైజ్ సీఐలు శ్యామ్ నాయుడు, నరసనాయుడు, రామచంద్ర కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠారెడ్డి, తిరుపతి ఎస్‌ఐలు స్వామినాథన్, హరికృష్ణ, జయశంకర్, మహేష్, కవీశ్వరనాయుడు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ట్రావెల్స్ బస్సు ఢీ - ఒకరు మృతి

ప్రమాదంలో మరో ఆరుగురికి గాయాలు



సంఘటన స్థలంలో బోల్తాపడిన ఆటో, గాయాలపాలైన కూలీలు

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నేలతిమ్మాయగారిపల్లె సమీపంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆటోను ఢీకొట్టింది. ముకుంద ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి వేంపల్లెకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకెళితే... వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కూలీలు ఆటోలో ఎర్రగుంట్లకు వెళ్తుండగా నేలతిమ్మయ్యగారిపల్లె వద్ద హైదరాబాద్ నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఆంజనేయులు, శ్రీనివాసులు, అంజనమ్మ, లక్ష్మయ్య, వీరయ్య, రమణమ్మ, చిన్నరాయుడుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరయ్య (7) మృతిచెందాడు. ఆంజనేయులు పరిస్థితి విషమసంఘటన స్థలాన్ని వీరపునాయునిపల్లె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

భారీ స్కోర్ దిశగా ఆంధ్ర

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర- హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రజట్టు భారీ స్కోర్ దిశగా సాగుతోంది. కడప నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకేనాయుడు ట్రోఫీ అండర్ 23 మల్టీడేస్ నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా శనివారం ఆంధ్ర- హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ నెగ్గిన ఆంధ్ర జట్టు బ్యాటింగ్ ఎంచుకుని మొదటిరోజు ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో కేవలం 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 360 పరుగులు భారీ స్కోరు సాధించింది. ఇందులో హేమంత్ రెడ్డి ఏకంగా 136 పరుగులు చేయగా, మరో బ్యాట్స్‌మెన్ వెంకటరాహుల్ 162 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

56 మద్యం బాటిళ్లు స్వాధీనం

లింగాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అంబకపల్లెలో బెల్టుషాపుపై దాడి చేసి 56 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ రమణ, ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపారు. పులివెందుల రూరల్ సీఐ రమణ ఆదేశాల మేరకు బెల్టుషాపు నిర్వహిస్తున్న శివగంగిరెడ్డిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

వంట మాస్టర్ ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల రోడ్డులోని ఓ మెడికల్ కళాశాల హాస్టల్‌లో వంట మనిషిగా పని చేస్తున్న ఎండీ మన్సూర్ ఖాన్(43) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప తాలూకా ఎస్‌ఐ ప్రదీప్ నాయుడు తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు కాకినాడ వాసి మన్సూర్ అలీ ఖాన్ విద్యార్థినులకు వంట చేసేవాడు. అతని భార్య ఫరియా బాలికల హాస్టల్ వార్డెన్‌గా పనిచేసేది. కొద్ది కాలంగా అనారోగ్యంతోనూ, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గుర్రం కొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషే కం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వా మి వారిని అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కడకడలో పంచముఖ ఆంజనేయస్వామికి..

కలకడ, ఫిబ్రవరి1 (ఆం ధ్రజ్యోతి): మండలంలో ని బాటవారిపల్లెలో కొలు వైన పంచముఖ ఆంజనే యస్వామి ఆలయంలో శనివారం విశేష పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వా మివా రికి వేకువజామునే అభిషేకం, ఆకు పూజ జరిపి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధి క సంఖ్యలో ప్రజలు స్వామివారిని దర్శించు కొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో సీఎంతో శ్రీరామ్‌చినబాబు



మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సంబేపల్లె పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు పాల్గొన్న కార్యక్రమాల్లో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు విస్తృతంగా పాల్గొన్నారు. శనివారం సంబేపల్లెలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డితో కలసి శ్రీరామ్‌చినబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు, తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జిలు చల్లాబాబు, జయచంద్రారెడి పాల్గొన్నారు.

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ అధికారి కె. సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం మదనపల్లెలోని పలు హాస్టల్‌లను ఆయన పరిశీలించి మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు 75 శాతం మార్కులు తక్కువ లేకుండా సాధించడానికి కృషి చేయాలని హాస్టల్ వార్డన్లను ఆదేశించారు. విద్యార్థులతో కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న మోనూ ప్రకారం భోజనాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ లోకేష్, హాస్టల్ వార్డన్స్ ఎం, వెంకటేస్, హేమావతి, రాంప్రసాద్, హరిష్‌బాబులు పాల్గొన్నారు.

పీలేరు ఏవోగా రాజేశ్వరి



పీలేరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యో తి): పీలేరు మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికా రి(ఏవో)గా బి.రాజేశ్వరి నియ మితులయ్యారు. చిత్తూరు జిల్లా పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తుండిన ఆమె పీలేరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. పీలే రులో ఏవోగా పనిచేస్తుండి కె.సతీశ్ మూడు నెలల క్రితం తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు ఏవోగా బదిలీ అయ్యారు.

భక్తిశ్రద్ధలతో నాగప్రతిష్ఠ

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్లపల్లె పంచాయతీ కొత్తపల్లెలో గ్రామస్థుల సహకారంతో నిర్మించిన నాగబింబ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం కొత్తపల్లెలో ఉదయం 6 గంటలకు గణపతిపూజ, గంగపూజ, గోపూజ, స్వస్తివాచనం, దేవనాంది, పంచగవ్యం, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ కలశస్థాపన ఉంటాయన్నారు. అనంతరం సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల మధ్య విగ్రహ ప్రతిష్ఠ, నవగ్రహ హోమం, ప్రాణప్రతిష్ఠ అభిషేకం, అలంకార కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 9 గంటలకు అశ్వర్థ కల్యాణం పూర్ణాహుతి మహామంగళారతి జరుగుతాయన్నారు. అనంతరం తీర్థప్రసాదాలతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని గ్రామస్థుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


పోటాపోటీగా ఖేలో ఇండియా ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా అస్మిత బాలికల ఫుట్‌బాల్ పోటీలు పోటాపోటీగా జరిగాయి. శనివారం స్థానిక జడ్పీహైస్కూల్లో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహించారు. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు, మున్సిపల్ ఉర్దూస్కూల్ జట్ల మధ్య, శ్రీవేద, వశిష్ఠ హైస్కూళ్ల జట్ల మధ్య, సీటీఎం, చెంబకూరు జడ్పీహైస్కూల్ జట్ల మధ్య ఫుట్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మురళీధర్, జాన్ కమలేశ్, వెంకటేశ్వరప్రసాద్, సీనియర్ క్రీడాకారులు శివశంకర్, పీడీలు దేవకమ్మ, నరేష్, తాజ్‌బాషా, పార్థసారధి పాల్గొన్నారు.

రైతులకు శాపంగా మారిన రీసర్వే

● ఉన్న భూమి పోయి.. లేని భూమి రికార్డుల్లో ఎక్కించి ● చేతివాటం చూపిన రెవెన్యూ అధికారులు ● లబోదిబోమంటున్న రైతన్నలు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వే రైతులకు శాపంగా మారింది. కాగా రెవెన్యూ అధికారులకు కాసుల వర్షం కురిపించింది. ఆయా గ్రామాల్లో చేపట్టిన రీసర్వేతో ఉన్న భూములు లేనట్లు లేని భూములు ఉన్నట్లు మాయ చేయడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళితే.. పెద్దతిప్పసముద్రం మండలంలోని సంపతికోట రెవెన్యూ గ్రామానికి సంబంధించి ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 708 మంది రైతులు భూసమస్యలపై అధికారులకు ఫిర్యాదులు చేశారంటే రీసర్వే ఏమేరకు చేశారో ఇట్టే అర్థమవుతుంది. మండలంలోని ఏడు గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టి సరిహద్దు రాళ్లను నాటారు. ఇందులో సంపతికోట గ్రామం ముంతపోగులపల్లెకు చెందిన రైతు మాచిరెడ్డి రవీంద్రరెడ్డి తన తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన 3.45 ఎకరాల భూమికి సంబంధించి 1995లో ప్రభుత్వం పాసు బుక్కు మంజూరు చేసింది. ఆ భూమిని తాకట్టు పెట్టి బ్యాంకులో రూ.5 లక్షలు రుణం తీసుకున్నాడు. రెండేళ్ల తరువాత తాను తీసుకున్న రుణాన్ని బ్యాంకుకు చెల్లించి తన భూమిని తన పేరిట మార్చుకోవడానికి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లి వన్‌బీ రికార్డును తీసుకెళ్లగా భూమి కొలతల్లో మార్పులు ఉన్నాయని సబ్ రిజిస్టర్ అధికారులు తెలిపారు. గతంలో 46-8లో1.36 సెంట్లు, 46-7లో 1.38 సెంట్లు, 39ఎలో 0.10 సెంట్లు, 31ఎలో 0.51 సెంటు, 155బిలో 0.10 సెంట్ల ఉండేదని బ్యాంకు వారు తాము లోన్ ఇచ్చే ముందు తమకు సమర్పించిన భూమి వివరాల్లో 155బిలో ఉన్న 0.10 సెంట్ల భూమి వేరే వారి పేరుతో పడిపోవడంతో తేడాలున్నాయని వాటిని సరిదిద్దుకుని వస్తేనే తన భూమిని తిరిగి తమ పేరుతో రిజిష్టర్ చేసి ఇస్తామని బ్యాంకు వారు తేల్చి చేప్పేశారన్నారు. ఈ విషయమై స్థానిక సచివాలయానికి వెళ్లి సంబంధిత రెవిన్యూ అధికారులను సమాచారం అడగగా సచివాలయంలో గ్రామ సర్వేయర్ అయిన అయ్యప్పరెడ్డి సరైన సమాచారం చెప్పకపోగా అగౌరవ పరిచి నీ ఇష్టమొచ్చిన చోట చెప్పుకో అని దౌర్జన్యం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా రైతు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ తనకు వారసత్వంగా వచ్చిన భూమిపై అప్పటి ప్రభుత్వం 53 ఖాతా నంబర్‌తో పాసుబుక్కు మంజూరు చేసిందని అయితే రీసర్వేలో తేడాలు రావడం గందరగోళంగా ఉందని వాపోయాడు. ఇప్ప టికైనా సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సరిదిద్ది తనకు న్యాయం చేయాలని లేకపోతే ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తోందని వాపోయాడు. మరి ఉన్నతాధికారులు దీనిపై ఎలా స్పందిస్తారో వేచిచూడాల్సిందే..



గతంలో రైతు భూమికి సంబంధించిన 1బీ రికార్డు

ప్రస్తుతం భూమి రికార్డుల వివరాలు

రీసర్వేలో ఇలాంటి సమస్యలు చాలా ఉన్నట్లు తెలిసింది

గతంలో జరిగిన రీసర్వే జరిగిన అన్ని గ్రామాల్లోనూ ఇలాంటి సమస్యలు చాలా ఉన్నట్లు రైతులు కూడా తమ దృష్టికి తీసుకొచ్చారు. ఇటువంటి సమస్యలన్నింటిని పరిష్కరిస్తాం. వాటిని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కొంత సమయం పడుతుంది. ఎక్కడా ఇలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తాం

- శ్రీరాములు నాయక్, తహసీల్దార్ పెద్దతిప్పసముద్రం

పెద్దపాళ్యం ఫ్లై ఓవర్‌పై రాకపోకలు ప్రారంభం

ములకలచెరువు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలం పెద్దపాళ్యం వద్ద ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలోని ఫ్లై ఓవర్‌పై శనివారం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. రైల్వేగేటుపై ఓ వైపు ఏర్పాటు చేసిన బూస్టింగ్ గిర్డర్‌పై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దేశంలోనే అతి పొడువైన జాతీయ రహదారి(ఎన్‌హెచ్-42) కావడంతో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో తరచూ రైల్వే గేటు పడుతుండడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరి నిలిచిపోతుండడంతో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేవి. జాతీయ రహదారిలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని పెద్దపాళ్యం రైల్వేగేటుపై ఫ్లై ఓవర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.49కోట్లు మంజూరు చేసింది. ఫ్లై ఓవర్ నిర్మాణానికి నిధులు విడుదల చేయడంతో 2019లో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. ఇరువైపులా రోడ్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు. అయితే రైల్వేగేటుపై వెళ్తున్న బ్రిడ్జిపై కొంత భాగం పనులు నిలిచిపోయాయి. ఇక్కడ దిమ్మెలు ఏర్పాటు చేస్తే పనులు ముగుస్తాయన్న సమయంలో రెండేళ్ల పాటు నిలిపేశారు. దీంతో బ్రిడ్జి నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రైల్వేగేటుపై బూస్టింగ్ గిర్డర్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో ఒక బూస్టింగ్ గిర్డర్ తయారీని పూర్తి చేసి గత ఏడాది డిసెంబరు 20వతేదీన భారీ యంత్రాల సహాయంతో రైల్వేగేటుపై ఏర్పాటు చేశారు. దీనిపై రోడ్డు వేసి తదితర పనులు పూర్తి చేసి రాకపోకలు అనుమతించారు. దీంతో బ్రిడ్జిపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. మరో వైపు ఏర్పాటు చేయాల్సిన బూస్టింగ్ గిర్డర్ తయారీ పనులు జరుగుతున్నాయి.



పెద్దెపాళ్యం ఫ్లై ఓవర్‌పై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

రూ.కోటి విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

● ఉన్నతాధికారులకు ఫిర్యాదుల వెల్లువ

● ఎట్టకేలకు స్పందించి బోర్డు నాటిన రెవెన్యూ అధికారులు




కబ్జా స్థలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లుగా ఎక్కడ పడితే అక్కడ ఇష్టారాజ్యంగా భూకబ్జాలు చేసి అడ్డుతగిలిన వారిపై దాడులు చేస్తూ రాక్షస పాలన సాగించిన వైసీపీ నాయకులు ప్రభుత్వం మారినా వారి పంథా మార్చుకోలేదు. తాజాగా పీటీఎం మండలంలోని కందుకూరు పంచాయతీ గ్రామ శివారులోని మూడు రోడ్ల కూడలిలో ఒక సెంటు రూ. 2లక్షలు పలికే చోట 1.50 ఎకరాల భూమిని వైసీపీ మాజీ కన్వీనర్ సుబ్బరాం కబ్జా చేసి యంత్రాలతో చదును చేయించి భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు కూసాలను తోలించాడు. దీంతో ఈ భూమి కొంచెం ఆర్‌అండ్‌బీకి మిగతా కుంట పొరంబోకు స్థలం కావున ఎలా కబ్జా చేసి ప్లాట్లు వేస్తారని గ్రామస్థులు ప్రశ్నించగా ఈ భూమి నాదే ఏం చేసు కుంటారో చేసుకోండి అంటూ తమ అనుచరులను అక్కడ తిష్ఠ వేయించి పనులను చేస్తూనే ఉన్నాడు. ఈ విషయమై కొందరు స్థానికులు ఉన్నతాధికారులకు వీడియో, ఫొటోలతో సహా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలంటూ పీటీఎం రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కబ్జా స్థలంలో ఇది ప్రభుత్వ భూమి ఇందులో ప్రవేశించిన వారు శిక్షార్హులు అంటూ బోర్డు నాటారు. భూమికి సంబంధించి రికార్డులు లేకపోయినా మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు అనే ధైర్యంతో కబ్జాకు ప్రయత్నించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈభూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం పంపిణీ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆభూమి ప్రభుత్వానిదే..

పీటీఎం మండలంలోని కందుకూరు మూడు రోడ్ల కూడలి వద్ద సుబ్బరాం అనే వ్యక్తి కబ్జాకు ప్రయత్నించిన భూమి ప్రభుత్వానిదేనని పీటీఎం తహసీల్దార్ శ్రీరాములునాయక్ తెలిపారు. అతనికి రికార్డు పరంగా ఎటువంటి హక్కు లేదని సమాచారం అందగానే మా సిబ్బందిని అక్కడికి పంపించి బోర్డు నాటించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

వైభవంగా రాజ గోపురం ప్రతిష్ఠోత్సవాలు



81 మట్టి కుండలతో కలశాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయ రాజ గోపురం ప్రతిష్ఠ మహోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. శనివారం వేకువజామునే వేదపండితులు స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి దూప, దీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం ఆలయ మండపంలో యాగశాల వైదిక కార్యక్రమాలు విశ్వక్సేన ఆరాధన, చతుష్టానార్చన హోమం నిర్వహించారు. మధ్యాహ్నం 81 మట్టి కుండల కళశాలు ఏర్పాటు చేసి కర్మగ స్నపనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ గోపుర కళశాలకు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేసి శాస్త్రోక్తంగా ధనాధివాసం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీటీడి వేదపండితులు క్రిష్ణప్రసాద్ భట్టర్, క్రిష్ణరాజు, రమేష్, ధనుష్ స్వామి, ఆలయ సిబ్బందిపాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన

ములకలచెరువు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువు, బురకాయలకోట గ్రామాల్లో శనివారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి ప్రతి నెల నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయిస్తున్నారన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నాయకులు కట్టా హరినాద్, గోపాల్‌రాజు, ఫజులు, పాస్టర్ శ్రీనివాసులు, నీలకంఠారెడ్డి, బీజేపీ నేత గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల పట్ల వివక్ష చూపుతున్న వారిపై చర్యలు తీసుకోండి

● ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ములకలచెరువు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపల్లె పంచాయతీలోని వాటర్ ప్లాంట్ వద్ద దళితులపై వివక్ష చూపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళితుల హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. దళితుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మంచాల హరికుమార్, సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, రైతుల సంఘం నేత వెంకటరమణనాయుడు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట శనివారం దళిత హక్కుల పోరాట సమితి, సీపీఐ డప్పు కళాకారులు, రైతు కూలీ సంఘం నాయకులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ వద్దకు నీరు పట్టుకునేందుకు వెళ్లిన దళితుడిపై అగ్రవర్ణాల వారు దాడి చేయడం దారుణమన్నారు. అనంతరం ఎంపీడీవో వెంకటనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం జిల్లా నాయకుడు రెడ్డెప్ప, నాయకులు సుబ్బన్న, జయకర, చంద్ర, ఎల్లప్ప, గోపాల్‌నాయక్, ఉత్తన్న పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కురబలకోట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు, విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రీసోర్సుపర్సన్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులకు 5రోజుల పాటు ఆధునిక యంత్ర అభ్యసనం, ఏఐ పద్ధతులపై ఫ్యాకల్టీడెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో మెరుగైన ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పరిశ్రమలలో ఎదురయ్యే అనేక సవాళ్లను సులభంగా అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న రైతులు

- పలు గ్రామాలలో కేబుల్‌వైర్లు చోరీ

నిమ్మనపల్లి ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జరుగుతున్న వరుస చోరీలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం రాత్రి నిమ్మనపల్లి, అగ్రహారం, తవళం గ్రామ పంచాయతీలోని రైతుల వ్యవసాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసుకున్న విద్యుత్ కేబుల్ వైర్లను కోసుకొని దొంగలు అపహరించారు. దాదాపు 30 వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలించినట్లు సమాచారం. వాటి విలువ దాదాపు రూ.2లక్షలు ఉంటుందని రైతుల తెలిపారు. శనివారం పంటలకు నీరు పెట్టేందకు బోరు వద్దకు వెళ్లగా కేబుల్ వైర్లు లేవని తెలిపారు. అలాగే బోడిగుండవారిపల్లి చెందిన రైతు రమణకు చెందిన వ్యవసాయ బోరు వద్ద రెండు ఎకరాల్లో డ్రిప్ వైరు కోసుకొని వెళ్లినట్లు తెలిపాడు. తవళం పంచాయతి కోమివానిటివానిచెరువు కింద బోర్లతో సాగు చేసిన 15మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లు దొంగలు అపహరించినట్లు వాపోయారు. ఒక్క రోజు రాత్రి మాత్రమే మూడు గ్రామాలలో కేబుల్ వైర్లు చోరీ కావడంతో రైతులు గిరి, మోహన్ రెడ్డి, అమరనాథ్ రెడ్డి, క్రిష్టారెడ్డి మదనమోహన్‌రెడ్డి బాస్కరెడ్డి, రామారావు, తులసి, బాస్కర్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కేబుల్‌వైర్ల చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

జాతీయ స్థాయిలో పీలేరు విద్యార్థి ప్రతిభ

పీలేరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పీలేరులోని వీఎస్ఎన్ స్మార్ట్ కిడ్స్ పాఠశాలకు చెందిన కె.చేతన్ విఖ్యాత్ రెడ్డి జాతీయ స్థాయిలో తన ప్రతిభ చాటాడు. దేశంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు లీడ్ ఇండియా సంస్థ నిర్వహించిన 'లీడ్ చాంపియన్స్-2024' పోటీల్లో భాగంగా ఏర్పాటు చేసిన 'స్పెల్లింగ్ చాంప్స్' విభాగంలో జాతీయ స్థాయిలో రన్నర్ అప్‌గా నిలిచి మెరిశాడు. న్యూఢిల్లీలో శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్స్‌లో చేతన్ విఖ్యాత్ రెడ్డి రన్నర్ అప్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా వీఎస్ఎన్ విద్యాసంస్థల అధినేత్రి మాధవి శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ దాదాపు 2 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్న 'స్పెల్లింగ్ చాంప్స్' పోటీలో తమ విద్యార్థి రన్నర్ అప్‌గా నిలవడం తమకు గర్వకారణమన్నారు. చేతన్‌కు తోడుగా నిలిచిన ప్రిన్సిపాల్ శోభ, ఉపాధ్యాయురాలు శ్రావణిని ఆమె అభినందించారు. రెండు, మూడు రోజుల్లో చేతన్ పీలేరుకు వస్తారని తెలియజేశారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేననేతలు నాగేంద్ర, నటశేఖర్



చౌడేశ్వరీ సర్కిల్‌లో కమలమరిక్రిష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె/టౌన్/అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం లోని మున్సిపాలిటీ తోపాటు మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో అటు నాయకులు, ఇటు అధికారులు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రిలోనే స్థానిక బెంగళూరు బస్టాండులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయా కూడళ్లు, వార్డుల్లో పార్టీశ్రేణులు ఏర్పాటు చేసిన కేక్ కట్ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజ రై, పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు అందుకున్నారు. టీడీపీ నాయకుడు ఆర్‌కే రామకృష్ణ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగు లు, సిబ్బంది, కార్మికులు పాల్గొని కేక్ కట్ చేశారు. బసినికొండలో జనసేన నాయకుడు పులగంటి నాగేంద్ర ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి, పార్టీశ్రేణులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కత్తిలక్ష్మన్న, పులగంటి నటశేఖర్, చుక్కా విజయ్ పాల్గొన్నారు. స్థానిక నిమ్మనపల్లెక్రాస్‌లోని మాజీసైనిక సంక్షేమ కార్యక్రమంలో ఆసంఘం డివిజన్ అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులు నాయుడు, కంచెర్ల చింటూ ఆధ్వ ర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పుంగనూరురోడ్డులోని బీసీ, ఎస్సీ హాస్టల్స్‌లో రేషన్ డీలర్ల సంఘం నాయకుడు ఎస్.మౌ ళాలి, స్టోర్ రఘు ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. నీరుగట్టువారిపల్లె, చౌడేశ్వరీ సర్కిల్‌లో 33వ వార్డు టీడీపీ నాయకులు కమలమర్రికృష్ణ, రామిశెట్టి కేశవ, రామిశెట్టిరెడ్డిశేఖర్, ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం నాయకులకు, కార్యకర్త లకు అన్నదానం చేశారు. విజయభారతి హైస్కూల్లో ప్రిన్సిపాల్ సేతు ఆధ్వర్యంలో, స్థానిక వెలుగు ప్రత్యేక పాఠశాలలో గంగారపు రామ్మూర్తినాయుడు, నాగూర్‌వలి, పోతబోలు సుధాకర్, వెంకటే శ్ ఆధ్వర్యంలో రామారావుకాలనిలో టీడీపీ జాన్‌బాబు ఆధ్వర్యంలో, కాలని గేట్ వద్ద రాయచోటి శశి, జంగాల రమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదినవేడుకలు జరుపుకు న్నారు. టీడీపీ నాయకులు షంషీర్, నాదెళ్ల శివన్న, నాగార్జున గాంధీ, జేసీబీ మధు, కంచెర్ల శ్రీనివాసులునాయుడు, బోర్‌వెల్ సుధాకర్, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెను పారిశ్రామికాభివృద్ధి చేయండి

● సీఎం చంద్రబాబుకు టీడీపీ నేత జయచంద్రారెడ్డి వినతి



సీఎంకు విన్నవిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజక వర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూని ట్లు, పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసి పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమం త్రి చంద్రబాబునాయుడును తంబళ్లపల్లె టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి కోరారు. జిల్లాలోని రాయచోటి నియోజకవ ర్గం సంబేపల్లె మండలం మోట్లకట్ల హెలిప్యాడ్ వద్ద చం ద్రబాబుకు స్వాగతం పలికిన జయచంద్రారెడ్డి తంబ ళ్లపల్లె సమస్యలపై వినతి పత్రం అందజేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో గత వైసీ పీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఉపాధి కరువై నిరుద్యోగులు ఇబ్బందులు పడడంతో పాటు అన్ని రంగాల్లో వెనుకబడిందని తెలిపారు. ఇక్కడ పరిశ్ర మలు ఏర్పాటు చేసేం దుకు స్థలాలు కూడా అందుబాటులో ఉన్నాయని, బెంగళూరు, తిరుపతి విమానాశ్ర యాలకు దగ్గరలో ఉండడంతో అనువుగా ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. హంద్రీ - నీవా జలాలు అన్ని చెరువులను నింపి తాగునీటి, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని, పెద్దమండ్యం మండలంలో 7,700 ఎకరాల ప్రభుత్వం భూమి ఉంద ని, ఇక్కడ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, అలాగే మూడు డిగ్రీ కళాశాలలు, ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

దారి సమస్యను పరిష్కరించాలంటూ ధర్నా



వాల్మీకిపురంలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న చాకలబండవీధి ప్రజలు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దారి సమస్య ను పరిష్కరించాలంటూ జాతీయ రహదారిపై స్థానిక చాకలబండవీధి వాసులు శనివారం ధర్నా చేశారు. స్థానిక చాకలబండవీధిలో గత 40ఏళ్లకు పైగా నివాసం ఉంటున్నామని అయితే కొందరు వ్యక్తులు నివాసాల నడుమ దారికి సంబంధించి పట్టా భూములంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. తిరుపతి రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నాచేశారు. సుమారు 100కు పైగా కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతంలో ప్రస్తుతం దారి సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నామని సమస్యను పరిష్కరించే దాకా కదిలేది లేదంటూ కూర్చున్నారు. దీంతో జాతీయ రహదారిపై అరగంట పాటు వాహనాల రాకపోకలు ఆగిపోయి తీవ్ర అంతరాయం నెలకొంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పి ధర్నా విరమింపచేశారు. అయితే సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తామంతా ఆందోళన చేపడతామని గ్రామస్థులు తెలిపారు. ఈకార్యక్రమంలో చాకలబండవీధి మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



కలికిరిలో డప్పు కొట్టి ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కలికిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదలో ఈ నెల 7న జరిగే లక్ష డప్పుల బహిరంగ సభను ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ పిలుపునిచ్చారు. కలికిరిలో జరిగిన లక్షల డప్పుల సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందిన విద్యావంతులు, నిరుద్యోగులు, విద్యార్థులు చొరవ తీసుకుని తరలి రావాలని కోరారు. అంతకు ముందు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం హైదరాబాదు సభకు సంబంధించిన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మా ర్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు వెంకటేష్, గురుప్రసాద్, వెంకట్రమణ, శ్రీనివాసులు, చరణ్, హరిబాబు, విశ్వనాథ, మహేష్, వెంకట్రమణ, సుబ్రమణ్యం, జె.వెంకట్రమణ, మల్లయ్య, వెంకటస్వామి, చంద్రయ్య, గురవయ్య, రెడ్డెప్ప, రమణయ్య, ఆనంద, డి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉరి వేసుకుని సచివాలయ ఉద్యోగి మృతి



రెడ్డిరోజా (ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):ఉరి వేసుకుని సచివాలయ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు కలికిరికి చెందిన పి.లక్ష్మీరవికుమార్ భార్య రెడ్డిరోజా(35) కలికిరి మండలం పారపట్లలోని సచివాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తోంది. మదనపల్లె పట్టణం, రామారావు కాలనీ, స్టోర్‌వీధిలో కాపురం ఉంటున్న అరుణమ్మ, రెడ్డెప్పల కుమార్తె రెడ్డిరోజాను లక్ష్మీరవికుమార్‌కు ఇచ్చి 15 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. ఇతను కలికిరిలోని ఓ ఫైనాన్స్‌లో మేనేజరుగా పని చేస్తున్నారు. అయితే శుక్రవారం మదనపల్లెలోని రామారావు కాలనీ అమ్మగారి ఇంటికి వచ్చిన ఆమె శనివారం ఉదయం ఇంట్లోనే తన చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలి పారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) బీసీ, కాపు, ఈ-బీసీ, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్యవైశ్యుల, క్షత్రీయ కులాలకు చెందిన వారు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్ ద్వార దరఖాస్తు చేసుకోవాలని పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్ రావు వెల్లడించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలో 53 యూనిట్లకు మంజూరైనట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.